సాక్షి
వైఎస్సార్ జిల్లా

శనివారం । 13 । జూలై । 2024



నీలి నాలుక వ్యాధితో ముప్పు

వర్షాల రాకతో గొర్రెలు, మేకలకు నీలి నాలుక వ్యాధి సోకుతుంది. వ్యాధి సోకిన గొర్రెల్లో 20 నుంచి 50 శాతం చనిపోయే అవకాశం ఉంటుంది. -8లో



ఎర్రచందనం దుంగల స్వాధీనం

మద్దిమడుగు గ్రామానికి దగ్గర 28 ఎర్రచందనం దుంగలను అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వాటి బరువు 736 కిలోలు ఉంటుంది. -8లో

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
37.0/27.8

జిల్లాలో శుక్రవారం 27.8 - 37.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 4.1 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

ప్రకృతి సేద్యం.. ఆరోగ్య భాగ్యం

పురుగుల మందులకు నేల గుల్లయ్యింది.. దిగుబడి తగ్గి రైతన్నకు నిత్యం కడుపుకోతే మిగులుతోంది. సారవంతమైన భూమి నిస్సారమవుతోంది. తరచూ వినిపిస్తున్న ఇలాంటి మాటలకు..వార్తలకు చెక్‌పెట్టడమే లక్ష్యంగా వ్యవసాయ అధికారులు ప్రణాళిక రచించారు. ప్రకృతి సేద్యం వైపు అడుగులు వేసేలా రైతన్నను ప్రోత్సహించారు. ఫలితంగా జిల్లాలో ప్రకృతి సేద్యం ఆశాజనకంగా ముందుకు 'సాగు'తోంది.

- పురుగు మందులు లేని ప్రకృతి వ్యవసాయంపై మొగ్గు
- పెట్టుబడి ఖర్చులు తగ్గించుకునేలా చర్యలు
- సాగు పెరిగేలా ప్రకృతి సేద్య సిబ్బంది ప్రణాళిక
- 2024-25 ఏడాదిలో 1,04,267 ఎకరాల సాగు లక్ష్యం



నవధాన్యాల సాగు

కడప అగ్రికల్చర్: జిల్లాలో రైతులు ప్రకృతి సేద్యం వైపు అడుగులు వేస్తున్నారు. పంటల సాగుకు సహకారం అందిస్తూ వ్యవసాయ పరంగా ఆర్థిక స్వావలంబన సాధించేందుకు అధికారులు కృషి చేస్తున్నారు. ఆ దిశగా జిల్లాస్థాయి అధికారుల నుంచి క్షేత్రస్థాయి సిబ్బంది వరకు అందరూ కృషి చేస్తున్నారు. ఈ మేరకు జిల్లాలోని అన్ని మండలాల పరిధిలో ఈ ప్రకృతి వ్యవసాయాన్ని సాగు చేపట్టేలా రైతులకు అవగాహన కల్పిస్తూ ఏటేటా ప్రకృతి వ్యవసాయ సాగును జిల్లాలో విస్తరింప చేస్తున్నారు. దీంతోపాటు పండ్లతోటలు, కూరగాయల పంటలు, ప్రధాన పంటల్లో అంతరపంటలను సాగు చేస్తూ భళా అనిపిస్తున్నారు.

జిల్లాలోని 36 మండలాల పరిధిలో...

జిల్లాలో 36 మండలాల పరిధిలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 1,04,267 ఎకరాల్లో వరి, పసుపు, వేరుశనగ, పొద్దుతిరుగుడు, శనగ, పత్తి, ఉల్లిలతోపాటు పలు రకాల పంటలను సాగు చేయనున్నారు. ప్రధాన పంటలసాగుకు ముందు నవధాన్యాల పంటల సాగు చేస్తే భూమికి అవసరమ్యే పోషకాలు పెరిగే అవకాశం ఉండటంతో ఈ పద్ధతిపై ప్రకృతి వ్యవసాయ విభాగం దృష్టి సారించింది. ఫలితంగా వ్యవసాయశాఖ రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ విభాగం పరిధిలో జిల్లాలో 205 రైతు భరోసా కేంద్రాల పరిధిలో 259 గ్రామాల్లో 487 మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇప్పటివరకు వివిధ పంటలసాగులో రసాయన ఎరువులను సిఫారసు మోతాదుకుంటే అధికంగా వాడటం వల్ల భూసారం కోల్పోయి క్రమేపీ పంట దిగుబడి శాతం తగ్గిపోతుంది. దీనికితోడు ఒకే పంటను సాగు చేస్తుంటడంతో పొలాల్లో పోషకాలు అసమతుల్యత ఏర్పడింది. ఇటువంటి తరుణంలో నవధాన్యాల పంటలు సాగు భూసారాన్ని పరిరక్షించడంలో కీలక పాత్ర పోషించనున్నాయి. వీటి సాగు వల్ల తక్కువ ఖర్చుతో అధిక పోషకాలను మొక్కకు అందించడంతోపాటు నేల భౌతిక లక్షణాలు మెరుగుపడి నేల ఆరోగ్యం కాపాడుతాయి. దీంతో ప్రస్తుతం జిల్లాలో చాలా మంది రైతులు ప్రధాన పంటలకు ముందుగా నవధాన్య పంటలను సాగు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఇప్పటివరకు జిల్లాలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 28,777 నవధాన్య కిట్లను సిద్ధం చేయగా వాటిలో 25,613 కిట్లను 12,170 మంది రైతలకు పంపిణీ చేశారు. వారంతా 15,675 ఎకరాల్లో నవధాన్య పంటలను సాగు చేశారు. ఖరీఫ్ సీజన్‌లో భాగంగా జులై చివరి వరకు ఈ నవధాన్య పంటల సాగు మరింత విస్తీర్ణంలో సాగు చేయనున్నారు.

2024-25 సంవత్సరంలో పంటల సాగు వివరాలు ఇలా..

సాగయ్యే పంటలు	రైతుల సంఖ్య	విస్తీర్ణం ఎకరాల్లో
వరి, పత్తి	27772	44521
శనగ	11369	16384
ఉద్యానపంటలు	29347	38754
కూరగాయలు	3718	4608
మొత్తం	72206	1,04,267

నవధాన్య పంటలసాగుతో ప్రయోజనాలు ఇలా...

- భూమిలో సూక్ష్మ, స్థూల పోషకాలు అభ్యమవుతాయి
- సేంద్రియ కర్బనశాతం పెరుగుతుంది
- ఏడాది పొడవునా భూమిలో పైరు ఉంటుంది. నేల చీలిపోకుండా ఉంటుంది
- నవధాన్యాల సాగుతో వేళ్లమధ్య సంపర్కం పెరిగి మొక్కకు కావాల్సిన పోషకాలు తయారవుతాయి.
- నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యం ఉంటుంది.
- ప్రధాన పంటసాగులో చీడపీడలు ఆశించవు
- జీవనవైవిధ్యంలో మొక్కకు కావాల్సిన పోషకాలు ఉత్పత్తి అవుతాయి
- పైరుకు మేలు చేసే సూక్ష్మ పోషకాలు వృద్ధి చెందుతాయి
- నవధాన్య పంటలను పొలంలో కలియదున్నడం వల్ల బాగా చితికి సేంద్రియ పదార్థంగా మారుతుంది.
- నేల భౌతిక లక్షణాల్లో మార్పు జరిగి వేరు వ్యవస్థ దడపడి గాలి, నీరు సులభంగా గ్రహించడానికి వీలవుతుంది.

లక్ష్యం మేర సాగుకు కృషి..



ప్రకృతి సేద్యంలో భాగంగా జిల్లాలో 2024-25 ఖరీఫ్, రబీ సీజన్‌లకుగాను 72176 మంది రైతులతో 1,04,267 ఎకరాల్లో వివిధ పంటలసాగు లక్ష్యంగా నిర్దేశించాం. ఈ మేరకు ప్రకృతి సిబ్బందితో కలిసి లక్ష్య సాధనకు కృషి చేస్తాను.

– రామకృష్ణరాజు, ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు అధికారి

న్యూస్‌రీల్

పార్టీ మారే ప్రసక్తే లేదు



ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి

కడప కార్పొరేషన్: తాను పార్టీ మారుతున్నట్లు జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తాను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మద్దతుతో ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలుపొందానని, చివరి వరకూ ఆ పార్టీకి కట్టుబడి ఉంటానన్నారు. వైఎస్సార్‌సీపీ అనుబంధ సభ్యునిగా కొనసాగుతానని, ఇప్పటికైనా ఈ దుష్ప్రచారం ఆపాలన్నారు.

ముగిసిన వైవీయూ పీజీ పరీక్షలు

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాలలో గత నెల 28వ తేదీ నుంచి జరుగుతున్న పీజీ సెమిస్టర్ పరీక్షలు శుక్రవారంతో ముగిశాయి. విశ్వవిద్యాలయంలోని 29 శాఖల విద్యార్థులు 2,4 సెమిస్టర్ల పరీక్షలను రాశారు. చివరి రోజున వైవీయూ ఆర్ట్స్ బ్లాక్‌లో జరుగుతున్న పరీక్షా కేంద్రాలను వైవీయూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్. రఘునాథరెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ ఎన్. ఈశ్వర్ రెడ్డి తనిఖీ చేశారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు వైవీయూ పరీక్షల విభాగం వెల్లడించింది.

కళాశాలలకు ఇంటర్ పాస్ సర్టిఫికెట్లు

కడప ఎడ్యుకేషన్: జిల్లాలోని అన్ని జూనియర్ కళాశాలలకు 2024 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు ఇంటర్మీడియట్ పాస్ సర్టిఫికెట్లను సంబంధిత కళాశాలలకు పంపించామని ఇంటర్ ఆర్‌ఐఓ బండి వెంకటసుబ్బయ్య తెలిపారు. విద్యార్థులు నేరుగా కళాశాల ప్రిన్సిపాల్‌ను సంప్రదించి పాస్ సర్టిఫికెట్లను పొందాలని ఆర్‌ఐఓ తెలిపారు.

అడుగంటిన జలాలు...

వరుణుడిపైనే ఆశలు

- గత నాలుగేళ్ల వరకు నిండుకుండలా జలాశయం
- ప్రస్తుతం గండికోట జలాశయంలో కనిష్ట స్థాయికి నీటిమట్టం



గండికోట జలాశయంలో కనిష్ఠస్థాయికి పడిపోయిన జలాలు

కొండాపురం: వైఎస్సార్ జిల్లాలో తాగు ,సాగునీటి అవసరాలను తీర్చే గండికోట జలాశయం(ఎద్దుల ఈశ్వర్‌రెడ్డి జలాశయం) లో నీటి మట్టం కనిష్ఠ స్థాయికి చేరింది. గత నాలుగు సంవత్సరాల్లో నిండుకుండలా కళకళలాడింది. ప్రస్తుతం వెలవెల బోతోంది. దీంతో సాగునీటి అవసరాలు తీరాలంటే వర్షం కురవాల్సిందే. వరుణుడు ముఖం చాటిస్తే జలశయం మీద ఆధారపడినరైతుల ప్రజల పరిస్థితి ఏంటన్నది ప్రశ్నార్థకంగా మారింది. గండికోట జలాశయం పూర్తి సామర్థ్యం 26.85 టీఎంసీలు కాగా 2టీఎంసీలు నిల్వ ఉంది . గతేడాది ఇదే సమయానికి జలాశయంలో 22 టీఎంసీలు నాలుగేళ్ల వరకు నీరు నిల్వ ఉంది. గండికోట జలాశయం నుంచి క్యూయిస్ గేట్లు ద్వారా మైలవరం జలాశయానికి 400 క్యూసెక్కులు నీటిని జిఎన్ఎస్ ఎస్ అధికారులు తాగునీటి అవసరాలకోసం నీటినిపంపిస్తున్నారు.

గండికోట నుంచి వెళ్లే ప్రాజెక్టులు వెలవెలబోతున్నాయి: గండికోట జలాశయం నుంచి 4.5 టీఎంసీలు పైన ఉంటేనే గండికోట ఎత్తిపోతల పథకం ద్వారా చిత్రవతి బ్యాలన్స్ రిజర్వాయర్,పైడిపాళెం ప్రాజెక్టులకు నాలుగేళ్ల వరకు భారీ మోటర్ల ద్వారా జలాలను ఎత్తిపోశారు. ప్రస్తుతం ఆయా ప్రాజెక్టులు కూడా వెలవెలబోతున్నాయి, జీఎన్ ఎస్ఎస్ మెయిన్ కాలువ ద్వారా గెట్లు ఎత్తి వామికొండ రిజర్వాయర్, సర్వరాయ సాగర్‌లకు అప్పట్లో కళకళలాడుతుండేవి ప్రస్తుతం వెలవెలబోతున్నాయి. ఆయా ప్రాజెక్టు కింద అయకట్టు ద్వారా సాగుచేసే రైతాంగం పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. శ్రీ శైలం జలాశయంలో ప్రస్తుతం తక్కువ టిఎంసీలు ఉండటంతో కృష్ణజలాలు తర లించే పరిస్థితి లేవు.

వరుణుడిపైనే ఆశలు:

గతంలో నాలుగేళ్లల్లో ఖరీఫ్ సీజన్ రాగానే అధిక వర్షాలు కురిసి ఎగువ ప్రాంతాల నుంచి చిత్రవతి నది, పెన్నానదుల ద్వారా గండికోట జలాశయంలోకి వరదనీరు ఉధృతంగా పారేది. గత రబీ సీజన్ ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో మేఘాలు ఊరిస్తూ ఉరిమిస్తూన్నాయంతే. ఫలితంగా ఆశలు అడిఆశలు అవుతున్నాయి. బోరుబావులల్లో నీటి మట్టం తగ్గుతున్నాయి మండలంలో ఖరీఫ్ సీజన్‌లో అడప దడప పదునులో రైతులు సాగు చేశారు రైతులు వరుణుడిపైనే ఆశలు పెట్టుకున్నారు.

నేటినుంచి సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాలు

నందలూరు: అన్నమయ్య జిల్లాలోని నందలూరు శ్రీ సౌమ్యనాథ ఆలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. శనివారం నుంచి 23వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్ కుమార్ తెలిపారు.

- 13న రాత్రి అంకురార్పణ, 14న ధ్వజారోహణం , యాలి వాహనం, 15న హంసవాహనం, 16న సింహవాహనం, 17న హనుమంత వాహనం, 18న శేషవాహనం, రాత్రి గరుడ వాహనం, 19న సూర్యప్రభ, రాత్రి చంద్రప్రభ, 20న కల్యాణోత్సవం, 21న రథోత్సవం, రాత్రి అశ్వవాహనం, 22న చక్రస్నానం, రాత్రి ధ్వజావరోహణం, 23న పుష్పయాగం, ఏకాంత సేవా కార్యక్రమాలు ఉంటాయని ఆయన తెలిపారు.



విద్యుద్దీప కాంతులతో సౌమ్యనాథస్వామి ఆలయం

చదువులపై ప్రభావం పడుతుంది



పిల్లలతో రేష్మా

నా పేరు రేష్మా, రామాపురం మండలం నీలకంఠ్రావుపేట. మా ఆయన పేరు షేక్ జహీర్. మేము కూలిపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. మాకు ఏడుగురు పిల్లలు ఉన్నారు. వీరిలో నలుగురిని చదివిస్తున్నాం. ఇద్దరు ఒకటో తరగతి, మరొకరు మూడో తరగతి, ఇంకొకరు నాలుగోతరగతి చదవుతున్నారు. మిగిలిన ముగ్గురు చిన్న పిల్లలు. నలుగురిని ప్రైవేటు స్కూల్‌లో చేర్పించాం. ఫీజులు కట్టాలని యాజమాన్యం ఒత్తిడి చేస్తోంది. చంద్రబాబు పిల్లలందరికీ తల్లికి వందనం ఇస్తామన్నారు. ఇంత వరకు డబ్బు ఖాతాలకు జమ కాలేదు.పిల్లలను ఎలా చదివించుకోవాలి. తల్లికి వందనం పథకం డబ్బు జమచేస్తే ఊరట లభిస్తుంది. లేదంటే పిల్లల చదువుపై ప్రభావం చూపుతుంది.

ఒక్కరికే ఇస్తే ఎలా..



ఇంట్లో ఎంత మంది పిల్లలు చదువుకుంటే అంతమందికి తల్లికి వందనం పేరుతో రూ.15వేలు ఇస్తానని చంద్రబాబు చెప్పారు. ఇప్పుడేమో ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు నాయుడు తల్లికి మాత్రమే రూ.15వేలు ఇస్తానని చెప్పినట్లు సెల్లులు, పేపర్లలో, టీవీల్లో వస్తోంది. నాకు నలుగురు పిల్లలున్నారు. ఇప్పటికే ముగ్గురు చదువుకుంటున్నారు. ఒక పాప ఇంటర్, పిల్లోడు ప్రైవేటు పాఠశాలల్లో చదుకోగా, ఒక పాప ప్రభుత్వ స్కూల్‌లో చదువుకుంటోంది. మరో పాపను వచ్చే సంవత్సరం స్కూల్‌కు పంపాలి. ఈ క్రమంలో ఒక్కరికే రూ.15వేలు ఇస్తే, మిగిలిన ఇద్దరిని ఎలా చదివించాలి. దీని వల్ల కుటుంబానికి ఆర్థిక ఇబ్బంది ఎదురవుతోంది. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం సీఎం చంద్రబాబునాయుడు హామీని నెరవేర్చాలి.


-ఎస్.జ్యోతి, గృహిణి, ఎస్సీ కాలనీ, చాపాడు, వైఎస్సార్ జిల్లా

తల్లికి వందనం.. పిల్లలకు బంధనం -9లో



బాబు మాట నీటి మూట

- 'తల్లికి వందనం' తిరకాసుపై భగ్గుమంటున్న వివిధ వర్గాలు
- అందరికీ ఇవ్వాలంటూ డిమాండ్



ఆ మనిషేం మారలేదు. 'మారిన మనిషంటూ' జనాల్ని నమ్మించారంతే. అధికారమే పరమావధిగా ముఖానికేసుకున్న అబద్ధాల హామీల ముసుగు తొలగిపోయింది. బాబు నిజ స్వరూపమేంటో నెలరోజులకే బట్టబయలైంది. ఇంకేముంది 'నాడు–నేడు' వెలుగు కరిగిపోయి.. విద్యా వ్యవస్థపై మెలమెల్లగా 'చంద్ర' గ్రహణం పడుతోంది. అవును.. బాబు మాటలు నీటిమూటలేనని రుజువయ్యాయి.... ఇసుకపై రాతలుగానే మారిపోయాయి. 'తల్లికి వందనం' పేరిట చదువుకునే ప్రతి పిల్లాడికి ఏటా పదిహేను వేలు ఇస్తామని చంద్రబాబు మాటిచ్చారు. మేనిఫెస్టోలోనూ ప్రకటించారు. అంతేనా ఎన్నికల ప్రచారంలో కాలికి చక్రాలు కట్టుకుని మరీ ఊరూరా తిరిగి హామీ ఇచ్చారు. అవన్నీ గాలి మాటలేనని తేలిపోయాయి. అందలమెక్కి నెలరోజులైనా కాకముందే 'ఒక్కరికే వందన'మన్నారు. ఏడు పదుల వయసు ఒంటిపైకొచ్చినా.. పదవికి పద్నాలుగేళ్ల వయసుదాటినా మాటమీద నిలబడని మనిషిగా..చంద్రబాబు చరిత్రలో నిలిచిపోయారంటూ మేధావులు.. ప్రజా సంఘాల వారు విమర్శలు చేస్తున్నారు. 'నిన్ను నమ్మి మోసపోయాం బాబూ..' అంటూ తల్లులు మండిపడుతున్నారు. ఒక్క పథకమైనా చెప్పినట్లు చేశావా బాబూ.. ఇక నువ్వేం మారతావులే' అంటూ తూర్పారబడుతున్నారు.

–సాక్షి, నెట్‌వర్క్

హామీ నిలుపుకోవాలి



ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ పేరిట టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు తల్లికి వందనం పథకం కింద ఇంట్లో ఎంతమంది చదువుకునే పిల్లలు ఉంటే అంతమందికి డబ్బు ఇస్తామని హామీ ఇచ్చారు. ఇప్పుడు జారీ చేసిన జీఓ 29లో ఆ స్పష్టత లేదు. ఇందువల్ల విద్యార్థుల తల్లిదండ్రులు అయోమయంలో పడ్డారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలుపుకోవాలి.

– వీరనాల శివకుమార్, జిల్లా కార్యదర్శి, డీవైఎఫ్ఐ

బాబుకిది పరిపాటే



ఎన్నికల సమయంలో ఓటర్లను ఆకర్షించేందుకు అలివిగాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక వాటిని తుంగలో తొక్కడం ముఖ్యమంత్రి చంద్రబాబుకు పరిపాటే. 2014లో కూడా రైతు రుణమాఫీ వంటివి ఎన్నో వాగ్దానాలు చేసి ఆ తర్వాత వాటిని అమలు చేయని చరిత్ర ఆయనకుంది. ఇప్పుడు అదే కోవలో తల్లికి వందనం నిలిచింది.

– నగిలి రాజేంద్రప్రసాద్, ఎస్ఎఫ్ఐ మాజీ రాష్ట్ర సహాయ కార్యదర్శి, కడప

ఇది బాధ్యతా రాహిత్యం...



రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి వస్తే ఒక కుటుంబంలో ఎంతమంది చదువుకుంటుంటే అందరికి తల్లికి వందనం కింద ఒకొక్కరికి రూ. 15 వేలు ఇస్తామని చెప్పారు. దాన్నే ఎన్నికల మేనిఫెస్టోలో కూడా పెట్టారు సంతోషమే. తీరా అధికారంలోకి వచ్చాక ప్రతి తల్లికి రూ. 15 వేలే అని జీవో ఇవ్వడం బాధ్యతారాహిత్యం. ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన దాని ప్రకారం అందరికీ తల్లికి వందనం కింద డబ్బులు బ్యాంక్ ఖాతాలకు జమ చేయాలి.

– దీఎం ఓబులేసు, గ్రేటర్ రాయలసీమ విద్యార్థి సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

బాధ్యత లేదా.. బాబూ !



చదువుతున్న పిల్లలందరికీ తల్లికి వందనం పథకాన్ని వర్తింపజేయాలి. ఎన్నికల సందర్భంగా సీఎం చంద్రబాబు ఈ ప్రచారాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లారు. విద్యార్థులు ఈ పథకంపై ఆశలు పెట్టుకున్నారు. అమలు చేయాల్సిన బాధ్యత బాబు ప్రభుత్వంపై ఉంది. – జగన్, రాయలసీమ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్,రాష్ట్ర అధ్యక్షుడు

ఇచ్చిన మాట నెరవేర్చండి..



ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం 'తల్లికి వందనం' పథకం ద్వారా అర్హులైన పిల్లలందరికీ పథకాన్ని వర్తింపచేయాలి. అలా కాకుండా లేని నిబంధనలు పెట్టడం, ఒక్కరికే పరిమితం చేస్తామనడం సరికాదు.

– ఎం.ఆర్. నాయక్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర విశ్వవిద్యాలయాల కో–కన్వీనర్, వైవీయూ

ప్రజలను వంచించడమే



ఎన్నికల సందర్భంగా ప్రజల ఓట్లను కొల్లగొట్టేందుకు చంద్రబాబునాయుడు 'తల్లికి వందనం' పథకాన్ని ప్రకటించారు. ఇప్పుడు కుటుంబంలో ఒక్కరికే పథకాన్ని అందిస్తాననడం ప్రజలను వంచించడమే అవుతుంది. ప్రజలకు సుపరిపాలన అందిస్తామని అధికారంలోకి వచ్చి బాబు సీఎంగా పగ్గాలు చేపట్టి ఇంకా నెల రోజులు కాకపోయినా అప్పుడే తన హామీని నిలబెట్టుకోలేకపోవడం విచారకరం. ప్రజా ఉద్యమాలకు దారి తీయకముందే మేల్కొని హామీని నిలబెట్టుకోవాలి. – సీఆర్‌వీ ప్రసాద్‌రావు, జిల్లా కన్వీనర్, హేతువాద సంఘం, కడప

క్లుప్తంగా

కారుకు నిప్పంటించుకుని వ్యక్తి మృతి



మంటలను అదుపుచేస్తున్న ఫైర్‌స్టేషన్ సిబ్బంది

పులివెందుల రూరల్ : పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని బొగ్గుడుపల్లె గ్రామానికి చెందిన ప్రభాకర్‌రెడ్డి (80) మద్యం మత్తులో కారుకు నిప్పంటించుకొని మృతిచెందాడు. వివరాలిలా ఉన్నాయి. ప్రభాకర్‌రెడ్డి కొద్దిరోజులుగా మతిస్థిమితం సరిగా లేకపోవడంతో వింతవింతగా ప్రవర్తిస్తున్నాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం తన కల్లంలో ఉన్న కారులోకి వెళ్లి పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్నాడు. ఫైర్‌స్టేషన్ ఎస్సై రామకృష్ణకు సమాచారం రావడంతో సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అప్పటికే ప్రభాకర్‌రెడ్డి మృతి చెందినట్లు ఆయన తెలిపారు.

నీటి పైపుల చోరీకి యత్నం

కొండాపురం : మండలంలోని దొంతికోనలో వెంకటేశ్వరస్వామి దేవస్థానానికి సంబంధించిన నీటి పైప్‌లైన్‌కు అమర్చిన ఇనుప పైపులు దొంగలించడానికి గుర్తు తెలియని వ్యక్తులు ప్రయత్నిస్తుండగా వాచ్‌మ్యాన్ కేకలు వేయడంతో పారిపోయినట్లు ఆలయ నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. పెన్నానది నుంచి దొంతికోన కొండపైకి వేసిన 35 ఇనుప పైపులను గురువారం మధ్యాహ్నం కట్ చేస్తుండగా దేవస్థానానికి చెందిన వాచ్‌మ్యాన్ చూసి ఎవరు మీరు అంటు కేకలు వేయడంతో వాటిని అక్కడే వదిలేసి పరారయ్యారు. వీటి విలువ రూ.80 వేల వరకు ఉంటుంది. గతంలో దొంతికోన కొండ పైకి విద్యుత్ దీపాల కోసం అమర్చిన ట్రాన్స్‌ఫారంతోపాటు విద్యుత్ తీగలను కూడా దొంగలించారు. ఇలాంటి సంఘటనలు జరగకుండా పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని భక్తులు కోరారు.

నీలి నాలుక వ్యాధితో జీవాలకు ముప్పు

- వర్షాల రాకతో గొర్రెలు, మేకలకు వ్యాప్తి
- వ్యాధి సోకితే వాటి ప్రాణాలకు రక్షణ కరువు
- అప్రమత్తత అవసరం అంటున్న పశు వైద్యులు
- ఆందోళనలో కాపరులు, యజమానులు



గొర్రెల మంద (ఇన్‌సెట్) గొర్రెకు సోకిన నీలి నాలుక వ్యాధి

కడప అగ్రికల్చర్ : జిల్లాలోకి రుతుపవనాల ఆగమనంతోపాటు అప్పుడప్పుడు ఏర్పడే ఉపరితల ఆవర్తనంతో వాతావరణంలో మార్పులు చోటు చేసుకుని వర్షాలు కురుస్తున్నాయి. గొర్రెలు, మేకల యజయానులు మారిన వాతావరణంతోపాటు అప్పుడప్పుడు కురుస్తున్న వర్షాలతో అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది. జిల్లా వ్యాప్తంగా 13,46,266 గొర్రెలు, మేకలు ఉన్నాయి. ఈ వర్షాల రాకతో గొర్రెలు, మేకలకు నీలి నాలుక వ్యాధి సోకుతుంది. ఈ వ్యాధిని ఆయా ప్రాంతాలను బట్టి మూతివాపు వ్యాధి, నోటి పుండ్ల వ్యాధి వంటి పేర్లతో కూడా పిలుస్తుంటారు. మందలో 50 నుంచి 70 శాతం గొర్రెలకు ఒకేసారి వచ్చే అవకాశం ఉంది. ఈ వ్యాధి సోకిన గొర్రెలలో 20 నుంచి 50 శాతం చనిపోయే అవకాశం ఉంటుంది. కావున గొర్రెలు, మేకల కాపర్లు, యజమానులు ఈ వర్షా కాలంలో వీటి పెంపకంలో అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది. జిల్లాలో ఇప్పటికే చాలా మండలాల్లో ఈ వ్యాధి లక్షణాలు కనిపిస్తున్నట్లు పలువురు గొర్రెలు, మేకల యజమానులు తెలిపారు.

వ్యాప్తి ఇలా..

గొర్రెలకు ఈ వ్యాధి వైరస్‌ల ద్వారా సోకుతుంది. ఈ వైరస్‌లకు మాధ్యమిక అతిదేయి దోమ జాతికి చెందిన కీటకాల ద్వారా వ్యాప్తి చెందుతుంది. మందలో ఒక గొర్రెకు ఈ వ్యాధి వస్తే ఒక గొర్రె నుంచి మరో గొర్రెకి వ్యాప్తి చెందుతుంది. ఈ వ్యాధి ప్రభావం ముఖ్యంగా జూలై, ఆగస్టు, సెప్టెంబర్, డిసెంబర్ నెలల్లో ప్రబలుతుంది.

లక్షణాలు..

- గొర్రెలలోకి వైరస్ ప్రవేశించి వారం రోజుల్లో దాని ప్రభావం కనిపిస్తుంది.
- 105 నుంచి 106 డిగ్రీల జ్వరం వచ్చి ఐదు రోజులకు పైగా ఉంటుంది.
- జ్వరం వచ్చిన 48 గంటల తర్వాత నోటి నుంచి చొంగ కారడం, నోరు మొత్తం ఎర్రగా మారడం, చొంగ కూడా నురుగలా మారి పెదవులు, చిగుళ్ల, పై దవడ, నాలుక వాచిపోవడం, నాలుక ఇరువైపులా పుండ్లు ఏర్పడి బాగా ఉబ్బి నీలిరంగుకు మారుతుంది.
- గొర్రెలకు రక్తపు జీరలు కనిపించడం, ముక్కు లోపల భాగం నుంచి చీము రావడం, చీముతోపాటు రక్తం రావడం చేస్తుంది. ఈ తరువాత ముక్కులో జిగురు ఎండిపోవడంతో శ్వాస తీసుకోలేని పరిస్థితి ఏర్పడి గొర్రెలు, మేకలు చనిపోయే అవకాశం ఉంటుంది. ఈ వ్యాధి గొర్రెలు, మేకలకు సోకినప్పుడు వాటిల్లో గర్భస్రావం కూడా అయ్యే అవకాశం ఉంటుంది.
- వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉన్న గొర్రెలలో కాళ్లకు కూడా పాకుతుంది. గిట్టల మొదటి భాగం ఎర్రగా కందిపోయి వాచి చీముపట్టి నడవలేక కుంటుతాయి.
- ఈ రోగం కారణంగా మేత తినలేకపోవడం వల్ల జీవాలు నీరసించి బరువు కోల్పోయి మృత్యువాత పడతాయి.
- వ్యాధి చివరి దశలో నాలుక నీలిరంగుకు మారుతుంది. నోటి నుంచి దుర్వాసన వస్తుంది.
- ఈ వ్యాధి మేకలకు అరుదుగా సోకుతుంది.

నివారణ

- జబ్బు చేసిన వాటిని మందలోని ఆరోగ్యవంతమైన జీవాల నుంచి వేరు చేయాలి. జబ్బు చేసిన వాటికి చికిత్స చేయాలి.
- పొటాషియం పర్మాంగనేట్ ఒక శాతం ద్రావణంతో నోటిలో పుండు కలిగి చోట శుభ్రమైన పొడిగుడ్డతో తుడిచి బోరో గ్లిసరిన్ ఆయింట్‌మెంట్ రాయాలి. లేదా టాపిక్యూర్ ఓరల్ స్ప్రే కూడా వాడవచ్చు.
- పశువైద్య డాక్టర్‌ను సంప్రదించి పెన్సిలిన్, ఓరల్ ఎన్రోఫ్లాక్సిసిన్ వంటి యాంటిబయాటిక్‌లను, జ్వరం రాకుండా మెలోనెక్స్ ప్లస్ మందులు నోటి ద్వారా గాని, ఇంజక్షన్ రూపంలో ఐదు నుంచి ఏడు రోజుల పాటు ఇవ్వాలి.
- గొర్రెలు నీరసంగా ఉంటే గ్లూకోస్, ఎలక్ట్రాల్ పొడర్‌ను నీటిలో కలిపి తాగించాలి. – వ్యాధి నుంచి కొలుకున్నాక సలైనులు ఎక్కించడం, లివర్‌టానిక్, బలానికి విటమినులు కలిగిన టానిక్‌లు, ఖనిజ లవణాలు అందించాలి.

ఆయుర్వేద చికిత్స

- ఈ వ్యాధి సోకిన గొర్రెలు, మేకలకు నేరేడు చెక్క 100 గ్రాములు, తులసి ఆకులు 50 గ్రాములు, నేల వేము ఆకులు 50 గ్రాములు, నూరి ముద్ద చేసి రోజుకు ఒక సారి 3 రోజులు ఇవ్వాలి.
- 150 గ్రాముల వావిల ఆకులు, 100 గ్రాముల వేపాకు ఒక నీటరు నీటిలో అర లీటరు అయ్యే వరకు మరిగించి ఆ నీటిని రోజుకు రెండు సార్లు చొప్పను 3 రోజులు ఇస్తే తగ్గిపోతుంది.

హోమియో చికిత్స

ఉదయం.. : వ్యాధి సోకిన వాటికి ఉదయం ఎనినేసియ 200, మెర్క్‌సాల్ 200, ఆసియం 200 మందులు తీసుకుని 5 చుక్కలు లేదా 5 మాత్రలు, 5 ఎంఎల్ వైవిరాల్ అనే విటమిన్లు ద్రావణంలో కలిసి ఉదయం ఇవ్వాలి.
మధ్యాహ్నం.. : రుస్ టాక్స్ 200లను 5 చుక్కలు లేదా 5 మాత్రలు వేయాలి.
సాయంత్రం.. : పల్సాటిల్ల 200లను 5 చుక్కలు లేదా 5 మాత్రలను వేయాలి. లేదంటే జెమ్ ఫార్మ వారి బూటి – డీఎస్‌ఓ అనే మందును వాడాలి.

జాగ్రత్తలు పాటించాలి



ఈ వ్యాధి దోమకాటుతో వ్యాప్తి చెందుతుంది. కాబట్టి గొర్రెల కాపర్లు సాయంత్రం వేళ 6 నుంచి 7 గంటలలోపే వేపాకు లేదా యూకలిప్టస్ ఆకు లేదా కలబందను కాల్చి మంద చుట్టూ వేయాలి. ఈ పొగకు దోమలు దూరంగా పారిపోతాయి. ముఖ్యంగా వ్యాధి సోకిన గొర్రెను మంద నుంచి వేరుచేయాలి. ఎందుకుంటే దానిని కుట్టిన దోమ ఆరోగ్యంగా ఉన్న గొర్రెను కుడితే దానికి కూడా వ్యాధి సోకుతుంది. గొర్రెలు, మేకల షెడ్లలో కీటకాలను చంపేందుకు ముందులు పిచికారి చేసుకుంటే వ్యాధి సోకకుండా ఉంటుంది. – డాక్టర్ రాంబాబు, పశువైద్యాధికారి, కడప

టీకాలు వేయించాలి



ప్రభుత్వం తరపున ఇండియన్ ఇమ్యూనోలాజికల్ లిమిటెడ్ సంస్థ రక్షా బ్లూ పేరిట సరికొత్త టీకాను రూపొందించింది. 2 మిల్లీల ఇంజెక్షన్‌ను కండకు గానీ, చర్మం కింద గానీ ఇవ్వాలి. కండకు ఇవ్వడం వల్ల నొప్పులు ఉండవు. గర్భంతో ఉండే జీవాలకు ఈ టీకాను ఇవ్వకూడదు. టీకాను వేసిన తరువాత 21 రోజులలోపు కబేలాలకు పంపకూడదు. – డాక్టర్ శారదమ్మ, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి

అనుమానంతో భార్యను కడతేర్చాడు

– హత్య చేసి శవాన్ని పూడ్చిపెట్టిన భర్త



రేష్మా (ఫైల్)



మృతదేహాన్ని పూడ్చిన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ప్రొద్దుటూరు క్రైం : వాళ్లిద్దరూ ప్రేమించి పెళ్లి చేసుకున్నారు.. అయితే వారి కాపురం నిత్యం గొడవలతో సాగేది.. భర్తతో గొడవ పడి భార్య తన పెద్దమ్మ ఇంటికెళ్లింది.. భార్య వద్దకు వెళ్లిన భర్త ఆమెపై ప్రేమ ఉన్నట్టు నటించాడు.. పార్కుకు వెళ్దామని చెప్పడంతో ఆమె నమ్మి అతని వెంట వెళ్లింది.. మాయమాటలతో ముళ్ల పొదల్లోకి తీసుకెళ్లి ఆమెను హత్య చేశాడు. అనుమానంతో రేష్మా (25)ను భర్త అన్వర్‌బాషా గొంతు నులిమి చంపేశాడు. ఈ సంఘటన ప్రొద్దుటూరులోని ఎర్రగుంట్ల రోడ్డులో శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మైలవరం మండలంలోని దొడియం గ్రామానికి చెందిన రేష్మాకు 10 ఏళ్ల క్రితం ప్రొద్దుటూరులోని అమృతానగర్‌లో ఉంటున్న అన్వర్‌బాషాతో ప్రేమ వివాహం అయింది. అతను జేసీబీ డ్రైవర్‌గా వెళ్తుంటాడు. వారికి 8 ఏళ్ల కుమారుడు, 6 ఏళ్ల కుమార్తె ఉన్నారు. ఈ క్రమంలో మరో వ్యక్తితో ఆమెకు వివాహేతర సంబంధం ఉందని భర్త అనుమానం పెంచుకున్నాడు. ఈ విషయమై తరచూ భార్యాభర్తలు గొడవ పడేవారు. 10 రోజుల క్రితం భర్తతో గొడవ పడిన రేష్మా ఈశ్వరరెడ్డినగర్‌లో ఉంటున్న తన పెద్దమ్మ ఇంటికి వెళ్లింది.

పార్క్‌కు వెళ్దామంటే భర్త వెంట వచ్చింది..

భార్యను ఎలాగైనా చంపాలని అన్వర్‌బాషా పన్నాగం పన్నాడు. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం ఈశ్వరరెడ్డినగర్‌లో ఉంటున్న భార్య రేష్మా వద్దకు వెళ్లాడు. సరదాగా పార్కుకు వెళ్దాం రా అంటూ ఆమెను పిలిచాడు. భర్త ప్రేమగా పిలుస్తున్నాడని భావించి రేష్మా అతని వెంట వెళ్లింది. ముందుగా అతను భార్యను ఎకోపార్కుకు తీసుకెళ్లాడు. ఇద్దరూ కొంత సేపు పార్కులో సరదాగా గడిపారు. తర్వాత పార్కు ఎదురుగా ఉన్న రిజర్వ్ ఫారెస్ట్ స్థలంలోని ముళ్ల పొదల్లోకి ఆమెను తీసుకెళ్లాడు. గొంతు నులిమి చంపేసి అక్కడే పూడ్చేశాడు. అక్కడి నుంచి అన్వర్‌బాషా నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి భార్యను హత్య చేసినట్లు తెలిపాడు. దీంతో పోలీసులు అతన్ని వెంటనే అదుపులోకి తీసుకున్నారు. రూరల్ సీఐ రమణారెడ్డి, వన్‌టౌన్ ఎస్‌ఐ శ్రీకాంత్, ఎస్‌ఐలు శివప్రసాద్, మంజునాథ్‌లు సంఘటనా స్థలానికి చేరుకొని రేష్మా మృతదేహాన్ని పూడ్చి పెట్టిన స్థలాన్ని పరిశీలించారు, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రమణారెడ్డి తెలిపారు.

చోరీ కేసు నమోదు

కడప అర్బన్ : కడప నగరం ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మారుతీనగర్‌లో నివాసం వుంటున్న చింతల వెంకటేశ్వర్లు ఈ ఏడాది మార్చి 26న ఉదయం 10 గంటలకు తాళం వేసి మధ్యాహ్నం 2:15 గంటల సమయంలో బయటకు వెళ్లాడు. ఆ సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు తాళం పగులగొట్టి ఇంటిలోని దాదాపు రూ.1.30 లక్షల విలువైన బంగారు ఆభరణాలను అపహరించుకుని వెళ్లారు. 18 గ్రాముల తాళిబొట్టు సరుడు, ఒక జత కమ్మలు, ఒక ఉంగరం అనే వస్తువులు చోరీ చేసుకుని వెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ భాస్కర్‌రెడ్డి తెలియజేశారు.

రిమాండ్‌లోని నిందితులు బెయిల్‌పై విడుదల

కడప అర్బన్ : సార్వత్రిక ఎన్నికల సమయంలో అనంతపురం జిల్లా తాడిపత్రిలో జరిగిన ఘర్షణల నేపథ్యంలో టీడీపీ, వైఎస్‌ఆర్‌సీపీ పార్టీలకు చెందిన దాదాపు 60 మందిని అప్పట్లో అరెస్ట్ చేశారు. వారిని మెజిస్ట్రేట్‌ల ముందు హాజరుపర్చగా కడప కేంద్ర కారాగారానికి రిమాండ్‌కు పంపించారు. ఎట్టకేలకు వారికి శుక్రవారం బెయిల్ మంజూరయ్యింది. దీంతో వారంతా కడప కేంద్ర కారాగారం నుంచి విడుదలయ్యారు.

డిప్లమా సెకండ్ ఇయర్‌కు స్పాట్ అడ్మిషన్లు

కడప ఎడ్యుకేషన్ : వైఎస్సార్ జిల్లాలోని పాలిటెక్నిక్ (ప్రభుత్వ, ప్రైవేటు)లో ఇంటర్ వృత్తి విద్యా కోర్సు ద్వారా డిప్లమా ద్వితీయ సంవత్సరంలో చేరుటకు స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కడప ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్, జిల్లా నోడల్ ఆఫీసర్ సీహెచ్ జ్యోతి తెలిపారు. సంబంధిత దరఖాస్తులను ఈ నెల 16వ తేదీలోగా పాలిటెక్నిక్ కళాశాలలో అందజేయాలని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి స్పాట్ అడ్మిషన్లను ఈ నెల 18వ తేదీన కడప నగర శివార్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో కౌన్సెలింగ్ ద్వారా నిర్వహిస్తామన్నారు. పూర్తి వివరాలకు httpr://aprbSret.in/ivc/ లేదా htt pr://a pr bSret.ap.gov.in సైట్‌లో చూసుకోవాలని తెలిపారు. ఇంటర్ వృత్తి విద్యా కోర్సు పూర్తి చేసి డిప్లమా ద్వితీయ సంవత్సరంలో అభ్యర్థులు తాము చేరదలచిన కళాశాలల్లో అప్లికేషన్ ఇచ్చిన తరువాత ఈ నెల 18వ తేదీ ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతోపాటు రెండు సెట్లు జిరాక్స్ సెట్లు రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు తీసుకుని రావాలని తెలిపారు. అభ్యర్థులు తమ సర్టిఫికెట్స్‌తోపాటు ప్రాసెసింగ్ రుసుం కట్టాల్సి ఉంటుందని చెప్పారు. ఓసీ, బీసీ అభ్యర్థులు ఆన్‌లైన్ అడ్మిషన్స్‌కు దరఖాస్తు చేసిన వారు రూ.900, చేయని వారు 1300, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన వారు రూ.500 చేయని వారు రూ. 900 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. స్పాట్ అడ్మిషన్‌లో సీటు వచ్చిన వారు గవర్నమెంట్ కళాశాలలో అయితే రూ. 4700, ప్రైవేటు కళాశాలలో అయితే రూ.25 వేలు రుసుం కట్టవలసి ఉంటుందని ఆమె వివరించారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

కమలాపురం : కమలాపురం పట్టణంలోని దర్గా వీధికి చెందిన బక్కా సుబ్రహ్మణ్యం (35) తన ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్‌ఐ హృషికేశ్వర్ రెడ్డి తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. కడప కార్పొరేషన్‌లో ఔట్ సోర్సింగ్ కార్మికుడిగా పని చేస్తూ జీవనం సాగిస్తున్న సుబ్రహ్మణ్యం రెండు రోజుల క్రితం తన భార్యతో గొడవపడ్డాడు. దీంతో భార్య ఇందిర పుట్టింటికి వెళ్లింది. మనస్తాపానికి గురైన అతను గురువారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శుక్రవారం ఉదయం ఇరుగు పొరుగు వారు చూసి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ హృషికేశ్వర్ రెడ్డి తన సిబ్బందితో కలసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆత్మహత్యపై స్థానికులతో ఆరా తీశారు. శవ పంచనామా నిర్వహించి పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు. కాగా మృతునికి భార్య, ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి తండ్రి సుబ్బరాయుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ వివరించారు.

'పోష్' చట్టం పటిష్టంగా అమలు చేయాలి



పోష్ చట్టానికి సంబంధించిన పోస్టర్లు ఆవిష్కరిస్తున్న అధికారులు

కడప సెవెన్‌రోడ్స్ : మహిళలపై లైంగిక వేధింపుల నివారణ చట్టం (పోష్)ను జిల్లాలో పటిష్టంగా అమలు చేయాలని డీఆర్వో గంగాధర్‌గౌడ్ అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ గ్రీవెన్స్ హాలులో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోష్ చట్టం –2013పై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. మహిళలు పని చేసే ప్రదేశాల్లో లైంగిక వేధింపులను అడ్డుకునేందుకు చట్టం రక్షణ కల్పిస్తుందన్నారు. ప్రతి మహిళ ఈ చట్టంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. జిల్లా స్థాయిలో లోకల్ కంప్లయింట్ కమిటీని ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. దీనికి చైర్ పర్సన్‌గా స్పెషల్ కలెక్టర్ కౌసర్‌భాను, కన్వీనర్‌గా ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి వ్యవహరిస్తారన్నారు. ఇద్దరు ఎక్స్ అఫిషియో సభ్యులు ఉంటారన్నారు. వేధింపులకు గురైన మహిళా ఉద్యోగులకు పరిహారం లభిస్తుందన్నారు. పది మందికి పైగా ఉద్యోగులు పని చేసే ప్రతి ప్రభుత్వ సంస్థలో కమిటీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి కమిటీ సమావేశం నిర్వహించాలని చెప్పారు. ఫిర్యాదులు ఉంటే పరిష్కరించాలన్నారు. ప్రతి సంవత్సరం కమిటీ వార్షిక నివేదికను సమర్పించాలన్నారు. ఈ కమిటీకి మూడు సంవత్సరాల కాలపరిమితి ఉంటుందన్నారు. వేధింపులకు గురైన మహిళలు మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్లకు ఫిర్యాదు చేయవచ్చన్నారు. మహిళల వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. స్థానిక ఫిర్యాదుల కమిటీ చైర్‌పర్సన్ కౌసర్‌భాను మాట్లాడుతూ గ్రామ, మండల స్థాయిలో ఈ చట్టం పట్ల విస్తృత అవగాహన కల్పించాలన్నారు. కన్వీనర్ శ్రీలక్ష్మి మాట్లాడుతూ 1997లో రాజస్తాన్‌లోని బన్వారిదేవి అనే మహిళా ఉద్యోగి లైంగిక వేధింపులకు గురైన నేపథ్యంలో సుప్రీంకోర్టు మార్గదర్శకాలు రూపొందించిందని పేర్కొన్నారు. చిన్న పిల్లల సమస్యలపై 1098, మహిళా సమస్యలపై 181, 112 టోల్ ఫ్రీ నంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదులు చేయవచ్చని సూచించారు. అనంతరం పోష్ చట్టంకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో దిశా డీఎస్పీ రమాకాంత్, కడప ఇన్‌చార్జి ఆర్డీఓ వెంకటపతి, జమ్మలమడుగు ఆర్డీఓ శ్రీనివాస్, విద్యాశాఖాధికారి అనూరాధ, సోషల్ వెల్ఫేర్ డీడీ సరస్వతి, ఆడా వైస్ చైర్మన్ నందన్, డీఆర్‌డీఏ పీడీ ఆనంద్‌నాయక్, బీసీ వెల్ఫేర్ అధికారి బ్రహ్మయ్య, మెప్మా పీడీ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

తుదిదశకు చేరుకున్న కబడ్డీ టోర్నమెంట్


– అండర్–14 విభాగంలో కడప జట్టుకు కాంస్య పతకం




కాంస్యపతకం సాధించిన కడప అండర్–14 జట్టు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇండియన్ సర్టిఫికెట్ సెకండరీ ఎడ్యుకేషన్(ఐసీఎస్ఈ) రీజినల్ కబడ్డీ టోర్నమెంట్ మ్యాచ్‌లు తుదిదశకు చేరుకున్నాయి. శుక్రవారం లీగ్ మ్యాచ్‌లతోపాటు క్వార్టర్ ఫైనల్, సెమీఫైనల్ మ్యాచ్‌లు ఉత్సాహంగా సాగాయి. అండర్–14 విభాగంలో హైదరాబాద్ పటాన్‌చెరువు శ్రీసాయి పబ్లిక్ స్కూల్, తూప్రాన్ అభ్యాస్ ఇంటర్నేషనల్ స్కూల్ జట్లు ఫైనల్‌కు చేరాయి. కడప హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ జట్టు మూడో స్థానంలో నిలిచి కాంస్యపతకం సాధించింది. అండర్–17 విభాగంలో హైదరాబాద్ పటాన్ చెరువు శ్రీసాయి పబ్లిక్ స్కూల్, కర్నూలు జాన్సన్ గ్రామర్ స్కూల్ ఫైనల్‌కు చేరాయి. అండర్–19 విభాగంలో హైదరాబాద్ హబ్సిగూడ సెయింట్ జోసఫ్ స్కూల్ జట్టు, గుంటూరు లయోల పబ్లిక్ స్కూల్ జట్టు ఫైనల్‌కు చేరాయి. కాగా శనివారం అన్ని విభాగాలకు సంబంధించిన ఫైనల్ మ్యాచ్‌లు నిర్వహించనున్నట్లు టోర్నమెంట్ నిర్వాహకులు తెలిపారు. అండర్–14 విభాగంలో మూడోస్థానం లభించిన కడప హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ జట్టును పాఠశాల యాజమాన్యం అభినందించింది.

హాకీ క్రీడాకారులకు అవార్డులు



లక్ష్మీకి అవార్డు ప్రదానం చేస్తున్న ఏపీ హాకీ ట్రెజరర్ థామస్ పీటర్



రుూనీస్‌కి అవార్డు అందజేస్తున్న హాకీ వైస్ ప్రసిడెంట్ సూర్యప్రకాష్

పులివెందుల టౌన్ : పులివెందుల పట్టణంలోని వైఎస్సార్ హాకీ క్రీడా మైదానంలో జరిగిన సౌత్ ఇండియా హాకీ చాంపియన్ షిప్ హాకీ క్రీడా పోటీలలో ఉత్తమ క్రీడాకారులకు శుక్రవారం అవార్డులు ప్రదానం చేశారు. గురువారం జరిగిన పోటీలలో తెలంగాణ– ఆంధ్రప్రదేశ్ మ్యాచ్‌లో ఆంధ్రా బెస్ట్ ప్లేయర్ లక్ష్మీకి ఏపీ హాకీ ట్రెజరర్ థామస్ పీటర్ అవార్డు ప్రదానం చేశారు. పాండిచ్చేరి–కేరళ మ్యాచ్‌లో పాండిచ్చేరి బెస్ట్ ప్లేయర్ రుూనీస్‌కి ఏపీ హాకీ వైస్ ప్రసిడెంట్ సూర్యప్రకాష్ అవార్డును ప్రదానం చేశారు. వీరిని హాకీ కోచ్‌లు అభినందించారు.

ఎర్రచందనం దుంగల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం దుంగలతో అటవీశాఖ అధికారులు

కడప అర్బన్ : కడప జిల్లా అటవీశాఖ అధికారి పి.వి సందీప్ రెడ్డి ఆదేశాల మేరకు కడప అటవీశాఖ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ కె.ప్రసాద్, మద్దిమడుగు సెక్షన్ సిబ్బంది ఎస్. షకీల్, ఎన్, బాషా, యు.చౌడయ్య, ఎల్.ముఖర్జీ, నందిని, పార్వతి, ప్రొటెక్షన్ వాచర్స్ అందరూ కలిసి నైట్ పెట్రోలింగ్ విధులను నిర్వహించారు. ఈ విధుల్లో భాగంగా మద్దిమడుగు గ్రామానికి దగ్గర తనిఖీలు చేస్తుండగా రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతంలో కడప– బెంగుళూరు జాతీయ రహదారికి ఆనుకుని కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు అటవీశాఖ వారిని చూసి పరారయ్యారు. వారు 28 ఎర్రచందనం దుంగలను వదిలేసి వెళ్లారు. వీటిని సీజ్ చేసి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డీడీలపై సిబ్బంది అలసత్వం

వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం తీరు

కడప రూరల్ : డీడీలను సకాలంలో బ్యాంకులకు సమర్పించడంలో వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం (జోన్–4) సిబ్బంది అసలత్వం ప్రదర్శించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. 2023 సెప్టెంబర్ 20వ తేదీన ప్రభుత్వం స్టాఫ్ నర్స్ నియామకాలకు నోటిఫికేషన్ జారీ చేసింది. అర్హులైన అభ్యర్థులు దరఖాస్తుతోపాటు వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం (జోన్–4) పేరు మీద నిబంధనల ప్రకారం ఎస్సీ, ఎస్టీలు రూ. 300, ఓసీ వర్గానికి చెందిన వారు రూ.500 చొప్పున డీడీలు తీసి దరఖాస్తుతోపాటు ఆ శాఖకు సమర్పించారు. ఆ విధంగా దాదాపు 9 వేలకు పైగా దరఖాస్తులతోపాటు డీడీలు వచ్చాయి. కాగా ఆ కార్యాలయ సిబ్బంది ఖాతా కలిగిన బ్యాంకుకు వెళ్లి ఓచర్‌లో డీడీ వివరాలను పొందుపరిచి బ్యాంకులో సమర్పించాలి. అనంతరం బ్యాంకు వారు సదరు కార్యాలయం ఖాతాలో డబ్బును జమ చేయడం జరుగుతుంది.

1,600 పైగా డీడీలు...

కాగా పాతవి కొత్తవి కలిపి మొత్తం 1600కు పైగా డీడీలకు గడువు ముగిసింది. దరఖాస్తుల ద్వారా వచ్చిన సొమ్మును కార్యాలయానికి సంబంధించిన అవసరాలకు వినియోగించుకొనే అవకాశం ఉంటుంది. అంటే ఈ డబ్బుతో కంప్యూటర్స్, ఫర్నీచర్, స్టేషనరీతోపాటు నియామకాలు, పదోన్నతుల కౌన్సెలింగ్ తదితర ఆ శాఖ అవసరాల కోసం ఖర్చు చేయడానికి ఉపయోగిస్తారు. తాజాగా డీడీలకు గడువు ముగియడం అనే అంశం చర్చకు దారి తీస్తోంది.

వేల సంఖ్యలో డీడీలు ఉన్నందున...

వేల సంఖ్యలో డీడీలు ఉన్నందున జాప్యం జరిగింది. మార్చిలో బ్యాంకుల పని ఒత్తిడి కూడా కారణమైందని సిబ్బంది తెలిపారు. బ్యాంక్ అధికారులను సంప్రదించాం. డీడీలకు గడువు ముగిసినా ఫరవాలేదు. సమస్యను పరిస్కరిస్తాం అని చెప్పారు. ఒక రిక్వెస్ట్ లెటర్ పెట్టమన్నారు. అలాగే డీడీలు ఏ బ్యాంకుకు చెందినవైతే ఆ బ్రాంచికి పంపాలని సూచించారు. వారు చెప్పిన విధంగా చేశాం. ఒక వారం నుంచి ఆ పనుల మీదే మా సిబ్బంది పని చేస్తున్నారు. చాలా వరకు డీడీల సమస్యలను పరిష్కరించాం. మరి కొన్ని డీడీలు మాత్రమే ఉన్నాయి. ఒకటి రెండు రోజుల్లో అన్నీ క్లియర్ అవుతాయి.

– డాక్టర్ రత్నకుమారి, రీజనల్ డైరెక్టర్, వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం కడప.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయండి

కడప ఎడ్యుకేషన్ : తల్లికి వందనం ద్వారా ప్రభుత్వం అందించే రూ.15 వేలు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మాత్రమే అందజేసి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని ఎస్టీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఆవుల శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం కడపలోని జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాలల కనీస వసతుల నిర్వహణకు అవసరమ్యే గ్రాంట్‌ను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలన్నారు. ప్రాథమిక పాఠశాలల అభివృద్ధికి గొడ్డలిపెట్టుగా మారిన జీవో 117ను రద్దు చేసి పరిరక్షించాలన్నారు. అలాగే హైస్కూల్ ప్లస్‌లో పీజీటీ పోస్టులన్నింటినీ భర్తీ చేయాలన్నారు. పాఠ్యపుస్తకాల పంపిణీలో జాప్యాన్ని నివారించి విద్యార్థులందరికీ అన్ని పుస్తకాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ తుపాకుల మురళి, జిల్లా ప్రధాన కార్యదర్శి రామచంద్ర, జిల్లా కార్యదర్శి ప్రసాద్, చంద్రశేఖర్, శ్రీరాములు, సలాం, రవిశంకర్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.